



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
డిసెంబర్ 18, 2024

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 10 | వెల 4/-




## 100% ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఒట్టిమాటే!

- 2021లోనే అన్ని ఇళ్లకూ తాగునీరు అబద్ధం
- 2024 జూలైలో 4.49 లక్షల ఇళ్లలో సర్వే చేస్తే.. 1.28 లక్షల ఇళ్లకు లేవని తేలింది
- పాఠశాలల్లో ఆహార కల్తీ పై అనుమానాలు
- శాసనమండలిలో మంత్రి సీతక్క

## అక్రమ నిర్మాణాలపై ఉపేక్ష వద్దు



- సాకులు చెప్పి క్రమబద్ధీకరించకూడదు
- అవసరమైతే అలాంటి వాటిని కూల్చివేయండి
- కోర్టులూ 'అనవసర సానుభూతి' చూపకూడదు
- అతిక్రమణలు జరిగితే అధికార్లకు జరిమానాలు
- కంప్లీషన్ సర్టిఫికెట్ ఉంటేనే బ్యాంకు రుణాలు
- ఆ పత్రం ఆధారంగానే కరెంటు, నల్లా కనెక్షన్లు
- నిబంధనలు పాటిస్తామని బిల్డర్లు హామీ ఇవ్వాలి
- నిర్మాణ దశలపై అధికారులు రికార్డు రాయాలి
- ఇందులో ఏ ఒక్కటి ఉల్లంఘించినా కోర్టు ధిక్కరణే
- సుప్రీంకోర్టు కీలక మార్గదర్శకాలు



## రైతులకు కాంగ్రెస్ ఏమీ చేయదు.. చేయనివ్వదు

::: ప్రధాని మోదీ

## హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ముర్ము

### స్వాగతం పలికిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్



హైదరాబాద్ , డిసెంబరు 17 : శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం 5.10 గంటలకు ప్రత్యేక విమానంలో హకీంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ(ఇన్‌చార్జ్ డీజీపీ) రవిగుప్తా, త్రివిధ దళాలకు చెందిన అధికారులతోపాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి రాష్ట్రపతి నేరుగా భారీ కాన్వాయ్‌తో సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంకు చేరుకున్నారు. ఈ నెల 21 వరకు ఐదు రోజుల పాటు అక్కడే ఉండి వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.



# హరీశ్ X భట్టి

### ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ పరస్పర విమర్శలు

- వాస్తవాలు నిరూపించేందుకు సిద్ధమంటూ సవాళ్లు
- ఎఫ్‌ఆర్‌బీఎం కింద రూ.51,277 కోట్లు మాత్రమే అప్పు చేశామన్న భట్టి
- గ్యారంటీల కింద రూ.61,991 కోట్లు,
- గ్యారంటీ లేని రుణాలు రూ.10,999 కోట్లు సమీకరించినట్లు వెల్లడి
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే రూ.1,27,208 కోట్లు అప్పు చేసిందన్న హరీశ్
- తాము పదేళ్లలో కేవలం రూ.4,17,496 కోట్లు మాత్రమే అప్పు చేసినట్లు వెల్లడి

హైదరాబాద్: గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో చేసిన అప్పులు.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేసిన అప్పులు.. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయాన్ని వేడెక్కించాయి. ఆరోపణలు.. ప్రత్యారోపణలు, సవాళ్లు.. ప్రతి సవాళ్లతో సభ అట్టుడికింది. ప్రస్తుత ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క..గత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న హరీశ్‌రావుల మధ్య వాడివేడి వాదనలు కొనసాగాయి. అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పరస్పరం విమర్శించుకుంటూ వారివారి లెక్కలను సభ ముందుంచారు.

**ప్రివిలేజ్ మోషన్‌పై మాట మార్చారు: భట్టి**

'రాజకీయాలు చేయటమే లక్ష్యంగా వ్యవహరించే హరీశ్‌రావు సభలో అన్నీ అబద్ధాలే

(మిగతా 2వ పేజీలో)

## ఫార్ములా-ఈ కేసులో ఏ-1గా కేటీఆర్?

- ఏ-2గా అర్వింద్ కుమార్.. ఏసీబీ నమోదు చేసే చాన్స్
- కేటీఆర్‌పై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి
- ఏసీబీకి సీఎస్ శాంతికుమారి లేఖ
- ఫార్ములా-ఈ నిధుల దుర్వినియోగం
- కేసులో బీఆర్ఎస్ నేత చుట్టూ బిగుస్తున్న ఉచ్చు



హైదరాబాద్, డిసెంబరు 17 : రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం. ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించనుంది. ఈ మేరకు ఏసీబీకి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అనుమతి ఇచ్చింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పని చేసిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ హయాంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేసిన అర్విందు కుమార్‌తో పాటు మరో ఇద్దరు అధికారులు ఇప్పటికే విచారణ

(మిగతా 2వ పేజీలో)

# జేపీసీకి జమిలి బిల్లులు!


### లోక్‌సభలో 2 బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్

- తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగ్
- అనుకూలంగా 269 ఓట్లు.. వ్యతిరేకంగా 198 ఓట్లు
- మొదటి అడుగులోనే లభించని 2/3 ఆధిక్యం!
- టీడీపీ, శివసేన శిందే వర్గం సంపూర్ణ మద్దతు
- రాజ్యాంగానికి, సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధం: విపక్షాలు
- దేశ హితం కోసమే జమిలి: అర్జున్‌రామ్ మేఘ్వాల్
- గైర్హాజరైన 20మంది బీజేపీ ఎంపీలకు నోటీసులు
- విస్తృత చర్చల నిమిత్తం జేపీసీ పరిశీలనకు బిల్లులు!
- ఆకు పచ్చ- జమిలికి మద్దతు(269 మంది)
- ఎరుపు- జమిలికి వ్యతిరేకం(198 మంది)
- తెలుపు- ఓటింగ్‌కు గైర్హాజరు అయినవారు



న్యూఢిల్లీ, డిసెంబర్ 17 : లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే ఉద్దేశంతో మోదీ సర్కారు చేపట్టిన 'ఒకే దేశం- ఒకే ఎన్నిక'కు సంబంధించి చట్టపరమైన ప్రక్రియ ఎట్టకేలకు మొదలైంది! ఈ అంశంపై అధికార, విపక్షాల మధ్య వాడివేడి చర్చ, బిల్లులను ప్రవేశపెట్టే తీర్మానంపై ఓటింగ్ అనంతరం.. జమిలి ఎన్నికలకు సంబంధించి అత్యంత కీలకమైన రెండు బిల్లులను కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ బిల్లుల్లో ఒకటి.. 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2024 కాగా, రెండోది కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లు, 2024. జమిలి ఎన్నికలు

(మిగతా 2వ పేజీలో)



## తెలంగాణలో.. ఎంబీబీఎస్ చేసినవాళ్లు లోకలే

- పీజీ కోర్సుల్లో.. స్థానిక కోటాకు వారు అర్హులే: హైకోర్టు
- ఈ కోవలో ఏపీ, రాజస్థాన్.. ఇతర రాష్ట్రాల విద్యార్థులు
- మెడికల్ పీజీ రూల్స్ వివరణ-2ను కొట్టివేసిన హైకోర్టు
- ఈ తీర్పు ఈ ఏడాదికే: ధర్మాసనం

హైదరాబాద్, డిసెంబరు 17 : పీజీ వైద్య కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన నిబంధనలపై హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. 15న్న ఆలిండియా కోటాలో.. తెలంగాణలో ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస పూర్తిచేసిన రాష్ట్రేతర విద్యార్థులు కూడా పీజీ కోర్సుల్లో స్థానిక కోటాకు అర్హులని పేర్కొంటూ.. ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ మెడికల్ కాలేజీల(పీజీ అడ్మిషన్లు) నిబంధనలు-2021లోని రూల్ 8(2)కు రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 28న జీవో 148, జీవో 149 ద్వారా చేసిన సవరణల్లోని వివరణ-2ను హైకోర్టు కొట్టివేసింది. "ఆలిండియా కోటాలో తెలంగాణలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన రాష్ట్రేతర విద్యార్థులు పీజీ మెడికల్ కోర్సుల్లో స్థానిక కోటాకు అర్హులు కాదు" అనేది ఈ రూల్ సారాంశం. దీంతో.. ఈ రూల్‌ను సవాల్ చేస్తూ సుమారు వందమంది రాష్ట్రేతర విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లలో సింహభాగం ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌కు చెందినవారున్నారు. అఖిల భారత కోటాలో భాగంగా వీరంతా తెలంగాణలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. తెలంగాణ మెడికల్ పీజీ కోర్సుల్లో స్థానిక కోటాకు తాము కూడా అర్హులమేనని వాదిస్తున్నారు. ఈ పిటిషన్‌లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ

(మిగతా 2వ పేజీలో)

# హరీశ్ X భట్టి

చెబుతారు. ఏడాదిలో మేం చేసిన అప్పులపై ఆయన చెప్పే లెక్కలు సరికాదు. పదేళ్ల వారి పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని చక్కదిద్దేందుకు కొంత అప్పు చేయక తప్పలేదు. ఇక పదేళ్ల వారి హయాంలో చేసిన అప్పుల లెక్కల్లోనూ ఆయనది ప్రజలను తప్పుదారి పట్టించే పద్ధతే. అందుకే మేం అధికారంలోకి రాగానే శ్వేతపత్రం రూపంలో వాస్తవాలను ప్రజల ముందుంచాం. మళ్లీ చర్చ పెడితే నిరూపించేందుకు సిద్ధం. బీఆర్ఎస్ నేతలు 10 సంవత్సరాల పాలనలో తప్పులు చేసినందుకు గత డిసెంబర్‌లో జనం శిక్షించారు. ఆరు నెలల్లో పార్లమెంటు ఎన్నికలప్పుడు డిపాజిట్ దక్కకుండా వారికి మతిపోయేలా చేశారు. అయినా వారిలో మార్పు రాలేదు. ఆ పార్టీది భూస్వామ్య మనస్తత్వం. భూమిలేని నిరుపేదలకు ఆర్థిక సాయం చేయరా? అని ఖమ్మంలో ఓ విలేకరి అడిగినప్పుడు, వారికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పా. దాని ఆధారంగా ప్రివిలేజ్ మోషన్ ఇచ్చి, ఇప్పుడు అప్పుల మీద అవాస్తవాలు మాట్లాడితే ఇచ్చామంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వారికి అనుకూలంగా సభ నియమాలు రూపొందించుకున్నారు. వారి నిబంధనల్లోనే సభలోకి ప్లకార్డులు తీసుకురావద్దని ఉంది..కానీ నిన్న తీసుకొచ్చారు. వీరా నామీద ప్రివిలేజ్ మోషన్ ఇచ్చేది? వారి హయాంలో స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నప్పుడు బీఏసీలో పాటించిన పద్ధతినే మేం ఇప్పుడు అనుసరిస్తున్నాం. ఇప్పుడు ప్రసాద్‌కుమార్ స్పీకర్‌గా ఉన్నారు. వ్యక్తి మారారు తప్ప స్పీకర్ స్థానం అదే. ఆ స్థానాన్ని గౌరవించాలి కదా.. నిన్న బీఏసీలో కాగితాలు విసిరి బయటకొచ్చి ఏవేవో మాట్లాడుతున్నారు.

**ఆ ప్రచారంలో వాస్తవం లేదు**

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్లు అప్పు చేసిందని విపక్షాలు చేసే ప్రచారంలో వాస్తవం లేదు. ఎఫ్ఆర్‌బీఎం కింద మేము రూ.51,277 కోట్లు మాత్రమే అప్పు చేశాం. గ్యారంటీల కింద రూ.61,991 కోట్లు, గ్యారంటీ లేని రుణా లు రూ.10,999 కోట్లు సమీకరించాం. మీ హయాంలో చేసిన అప్పుపై వడ్డీ రూపేణ రూ.66 వేల కోట్లు చెల్లించాం. మీరు పెట్టిపోయిన పెండింగు బిల్లులు రూ.40 వేల కోట్లలో ఇప్పటికి రూ.14 వేల కోట్లు చెల్లించాం. ప్రజల ఆస్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన ఔటర్ రింగురోడ్డును ఆ ప్రభుత్వం 30 ఏళ్ల లీజు పేరుతో అమ్ముకుంది. అదే పద్ధతిలో మేం వచ్చే 30 ఏళ్ల కాలానికి జీఎస్టీ లాంటి ఆదాయ వ్యవహారాలను ఏ అదానికో, అంబానికో లీజుకిస్తే రాష్ట్ర పరిస్థితి ఏం కావాలి?..'అని భట్టి నిలదీశారు.

**పరిమితంగానే మా అప్పులు: హరీశ్‌రావు**

'మా ప్రభుత్వం పరిమితంగా చేసిన అప్పును తప్పుడు లెక్కలతో పెంచి భూతద్దంలో చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అబద్ధపు అప్పుల బూచి చూపి ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ ఆటలు సాగనివ్వం. మేం చెప్పే లెక్కలే సరైనవని నిరూపించేందుకు సిద్ధం. సభలో ప్రత్యేక చర్చ పెట్టండి, ఆడిటర్లను, ఆర్థిక నిపుణులను పిలిపించుకోండి.. నేను చెప్పేవే సరైన లెక్కలని నిరూపిస్తాను. ఇది నా ఛాలెంజ్. ఆర్బీఐ నేటి లెక్కల ప్రకారం గత ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పులు రూ.1,27,208 కోట్లు. ఐదేళ్లలో చేయబోయే అప్పు దాదాపు రూ.6,36,400 కోట్లు. కానీ మా ప్రభుత్వం పదేళ్ల కాలంలో తెచ్చిన అప్పులు కేవలం రూ.4,17,496 కోట్లు మాత్రమే. 'ఆర్బీఐ తాజాగా విడుదల చేసిన గణాంకాలను ఆయన ఉటంకించారు) కరోనా కారణంగా కేంద్రం అదనంగా 1.75 శాతం అప్పు తీసుకోవాలని సూచించడంతో తీసుకున్నాం. లేకపోతే అంతకూడా అప్పు అయ్యేది కాదు. దీనిపై నేను సవాల్ విసురుతున్నా.. చర్చకు సిద్ధం. మేం రూ.6,71,757 కోట్లు అప్పు తీసుకున్నామని ఒకసారి, రూ.7 లక్షల కోట్లు అని మరోసారి, సభలో రూ.7,11,911 కోట్ల అప్పులంటూ నోటికొచ్చినట్లు అబద్ధాలు చెబుతున్నారు. ప్రత్యేక చర్చ పెడితే వాస్తవాలు నిరూపిస్తా. ఏడాది పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా, గత ప్రభుత్వం చేసిన అప్పులపై తప్పుడు లెక్కలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీఏసీతో సంబంధం లేకుండా సభలో బిల్లులు ప్రవేశపెట్టడం వింతగా ఉంది. గత సభలో అప్పుల గురించి తప్పుడు లెక్కలు చూపినందుకే భట్టి విక్రమార్కపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చాం. కానీ మరో అంశంపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చినట్టు అబద్ధాలు చెప్తున్నారు. చర్చ పెడితే వాస్తవాలు నిరూపిస్తాం..'అని హరీశ్‌రావు సవాల్ చేశారు.



## లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి

వార్త మిర్రర్ శంషాబాద్ : లగచర్ల రైతులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహానికి మల్కారం పిఎసిఎస్ చైర్మన్ సతీష్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచర్ల శ్రీనివాస్, వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దళిత, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా లాక్కొని వారిని రోడ్డుపైన పడేసే కుట్ర చేస్తున్నదని, కాంగ్రెస్ రాజ్యాంగ వ్యతిరేకంగా అడుగడుగున వ్యవహరిస్తూ రైతులను అక్రమంగా అరెస్టు చేసి వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించిన దళిత, గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా లాక్కొని వారిని రోడ్డుపైన పడేసే కుట్ర చేస్తోందని కాంగ్రెస్ రాజ్యాంగ వ్యతిరేకంగా అడుగడుగున వ్యవహరిస్తున్న తీరుకు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి రావాలని ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు, రాజేందర్,అశోక్,గుంటి చరణ్,ఆర్ రమేష్,రాజు నాయక్, పరంధాములు, రాజు, జగదీశ్వర్ గౌడ్,శ్రీకాంత్,శ్రీనివాస్, నరసింహ,జంగారావు, అర్జున్, వెంకటేష్ ముదిరాజ్,కొమ్ము గోపాల్, మురళి,పర్వతం మల్లేష్,మహేష్ యాదవ్,రామకృష్ణ పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఉపేక్ష వద్దు

## సాకులు చెప్పి క్రమబద్ధీకరించకూడదు

## అవసరమైతే అలాంటి వాటిని కూల్చివేయండి

## కోర్టులూ 'అనవసర సానుభూతి' చూపకూడదు

## సుప్రీంకోర్టు కీలక మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 17: అక్రమ నిర్మాణాల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. పరిపాలనాపరమైన జాప్యం జరిగిందనో, పెట్టుబడులు పెట్టారనో కారణాలు చూపించి ఎట్టిపరిస్థితుల్లోనూ అక్రమ కట్టడాలను క్రమబద్ధం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ నిర్మాణాలకు బాధ్యులైన అధికారులపై జరిమానాలు విధించాలని పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నివాస భవనాలను వాణిజ్య నిర్మాణాలుగా మార్పిడి చేసిన కేసుపై విచారణ జరిపిన జస్టిస్ జె.బి.పార్థీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం అక్రమ కట్టడాల నిరోధంపై వెలువరించిన 36 పేజీల తీర్పులో పలు ఆదేశాలు ఇచ్చింది. ఆ భవనాల కూల్చివేతను సమర్థించింది. భవన నిర్మాణం పూర్తయిన తరువాత కూడా అక్రమంగా పనులు చేపట్టినా సత్వరమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని తెలిపింది. అక్రమంగా నిర్మించిన భాగాన్ని కూల్చివేయడం, తప్పు చేసిన అధికారులకు జరిమానా విధించడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పట్టణ ప్రణాళిక చట్టాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, అధికారుల్లో జవాబుదారీతనం ఉండేలా చూడాల్సి ఉందని తెలిపింది. స్థానిక అధికారులు ఆమోదించిన బిల్డింగ్ ప్లాన్‌ను ఉల్లంఘించి పనులు చేపట్టడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. అసలు బిల్డింగ్ ప్లానే లేకుండా చేపట్టే నిర్మాణాలను ధైర్యంతో నిలిపివేయాలి. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు జరుగుతున్నట్టు కోర్టు దృష్టికి వస్తే వాటిని ఆపాలి. ఏ మాత్రం కనికరం చూపినా అది 'అనుచిత సానుభూతి' కిందకు వస్తుంది. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణలో ఆలస్యం, పరిపాలనపరమైన వైఫల్యాలు, నియంత్రణ వ్యవస్థల అసమర్థత, నిర్మాణ వ్యయం అధికంగా ఉందన్న కారణం చూపడం, పెట్టుబడులు పెట్టారని చెప్పడం, చట్టం అమలులో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం, బద్ధకంగా వ్యవహరించిందన్న కారణాలు చూపించి అక్రమ నిర్మాణాలకు అనుకూలంగా వ్యవహరించకూడదు. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణను అసాధారణ పరిస్థితుల్లోనే చేపట్టాలి. అదీ కేవలం ఒకేఒకసారి ఏకకాల పరిష్కార మార్గంగా చేపట్టాలి. అంతకుముందు సర్వే చేసి వాస్తవాలను నిర్ధారించాలి. క్రమబద్ధమైన అభివృద్ధి ఉండాలన్న ఉద్దేశంతో ప్రణాళికలు రూపొందిస్తారు. వాటిని ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే విద్యుత్తు, భూగర్భ జలాలు, రోడ్లపై ఒత్తిడి పెరిగి అసలు హక్కుదార్లకు ముప్పు ఏర్పడుతుంది. వారి జీవనానికి ఇబ్బంది అవుతుంది. భవనం పనులు జరుగుతున్నంత కాలం నిర్మాణ స్థలంలో 'ఆమోదం పొందిన బిల్డింగ్ ప్లాన్'ను ప్రదర్శించాలి. అధికారులు కూడా నిర్ణీత వ్యవధిలో తనిఖీలు చేస్తూ వాటిని రికార్డుల్లో రాయాలి. నిబంధనలు పాటిస్తామంటూ బిల్డింగ్ ప్లాన్‌కు ఆమోదం తెలిపే సమయంలో బిల్డరు/దరఖాస్తుదారు నుంచి ఓ హామీ పత్రం తీసుకోవాలి. "సంబంధిత అధికారుల నుంచి కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ తీసుకున్న తరువాతే బిల్డింగ్‌ను యజమానులు/లబ్ధిదారులకు అప్పగిస్తాను" అంటూ ఆ హామీ పత్రంలో రాయాలి. తనిఖీలు చేసిన అనంతరం ఎలాంటి అతిక్రమణలు లేకుండా పనులు జరిగినట్టు అధికారులు సంతృప్తి చెందితే అనవసర జాప్యాలు లేకుండా కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ జారీ చేయాలి. అతిక్రమణలు జరిగినట్టు గుర్తిస్తే చట్టం ప్రకారం తీసుకోవాలి. కంప్లీషన్ సర్టిఫికెట్ జారీని వాయిదా వేయాలి. తగిన మార్పులు, చేర్పులు చేసిన తరువాత మాత్రమే ఆ సర్టిపికెట్ ఇవ్వాలి. కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ పొందిన తరువాత మాత్రమే విద్యుత్తు, మంచినీరు, మురుగునీటి కనెక్షన్ల సౌకర్యాలను సంబంధిత అధికారులు ఇవ్వాల్సి ఉంటుంది. కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదనో, అక్రమ నిర్మాణాన్ని క్రమద్ధం చేయలేదనో, అతిక్రమణలను రాటిపై చేయలేదనో బిల్డర్/యజమాని చేసిన ఫిర్యాదులు, పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు, రివిజన్లపై చట్టంలో పేర్కొన్న విధంగా 90 రోజుల్లోగా అధికారులు నిర్ణయం తీసుకోవాలి. కంప్లీషన్ సర్టిఫికెట్‌ను నిశితంగా తనిఖీ చేసిన అనంతరమే భవనాన్ని తనఖాకు పెట్టుకొని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు మంజూరు చేయాలి. వీటిలో ఏ ఒక్క ఆదేశాన్ని ఉల్లంఘించినా అది కోర్టు ధిక్కరణ కిందికే వస్తుంది. ఈ ఆదేశాలను అన్ని హైకోర్టులు అమలు చేసేలా తీర్పు కాపీలను వాటికి పంపాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌ను ధర్మాసనం సూచించింది.




## జర్నలిస్టులు ఆటవిడుపు కోసం జరుగుతున్న క్రీడాలు

విశాఖపట్నం వార్త మిర్రర్ : ఉపకార్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుతారావు సహాయసహకారంతో నిర్వాసిస్తునాటువంటి వైజాగ్ మీడియా క్రికెట్ టోర్ని 2024 విశాఖ ఇందిరా ప్రియదర్శని స్టేడియంలో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండొవ రోజు జరిగిన ఈ టోర్నిలో మెదటిగా వెబ్ వారియర్స్ తో వెబ్ టైగర్స్ తలపడగా తోలి బ్యా టింగ్ చేసిన వెబ్ టైగర్స్ నిర్ణత 18 ఓవర్లలో 132/7 పరుగులు చేయగా వెబ్ వారియర్స్ 128/7 పరుగులు చేయగా వెబ్ వారియర్స్ విజయం సాధించి సెమీఫైనల్స్ కు చెరికుంది. మధ్యానం జరిగిన లోకల్ వారియర్స్ vs ప్రజాశక్తి తలపడగా నిర్ణత 15 ఓవర్లలో లోకల్ వారియర్స్ 140/4 చేయగా ప్రజాశక్తి టీం 137/5 చేయడంతో లోకల్ వారియర్స్ విజయం చేజేసుకొని సెమీఫైనల్స్ కు చేరుకున్నారు. విజయం సాధించిన జట్టులకు ఉపకార్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుతారావు గారు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఇది కేవలం జర్నలిస్టులు ఆటవిడుపు కోసం జరుగుతున్న క్రీడాలు కావున గెలుపు ఓటములు కోసం కాదని ప్రతి ఒక్కరు క్రీడాలో పాల్గొనేందుకు జర్నలిస్టులు మార్గదర్శకులు అవుతున్నారని జర్నలిస్టులను ఆదర్శంగా తీసుకొని యువక్రీడాకారులు ముందుకు వచ్చి దేశానికి పాతకాలను తీసుకువచ్చేందుకు దారితీస్తుంది కంచర్ల ఆచ్యుతరావు కొనియాడారు.

## ఫార్ములా-ఈ కేసులో ఏ-1గా కేటీఆర్?

ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ 1గా, అర్వింద్‌కుమార్‌ను ఏ2గా చేర్చనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా, అవినీతి ఆరోపణలపై ఎవరైనా ఎమ్మెల్యేను విచారించాలంటే రాష్ట్ర గవర్నర్ ముందస్తు అనుమతి తప్పనిసరి. కేటీఆర్‌ను ప్రశ్నించేందుకు గవర్నర్ ఇప్పటికే అనుమతిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో శాంతికుమారి.. గవర్నర్ అనుమతి గురించి తెలుపుతూ మంగళవారం ఏసీబీకి లేఖ రాశారు. రూ.55 కోట్ల ఫార్ములా-ఈ నిధుల దుర్వినియోగం కేసులో విచారణకు తమ ముందు హాజరు కావాలంటూ ఏసీబీ కేటీఆర్‌కు నోటీసులు పంపనుంది. మరోవైపు, పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం శాసనసభలోని సీఎం చాంబర్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. కేటీఆర్ కేసుకు సంబంధించిన వివరాలను సీఎంకు వివరించినట్టు సమాచారం.

## రైతులకు కాంగ్రెస్ ఏమీ చేయదు.. చేయనివ్వదు: ప్రధాని మోదీ

జైపూర్, డిసెంబరు 17: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రైతుల పేరుతో కాంగ్రెస్ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుందని, కానీ వారి కోసం ఏమీ చేయదని, ఇతరులనూ చేయనివ్వదని ఆరోపించారు. రాజాస్థాన్‌లో భజన్ లాల్ ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా మంగళవారం నిర్వహించిన 'ఏక్ వర్ష్- పరిణామ్ ఉత్కర్ష్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలకు పరిష్కారాన్ని కనుగొనడానికి బదులుగా కాంగ్రెస్ వాటిని ప్రోత్సహిస్తోందని, తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్టును ఆ పార్టీ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడమే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 46,300 కోట్లకు పైగా విలువైన 24 ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మరోవైపు, ప్రధాని 21 నుంచి కువైత్‌లో 2 రోజుల పాటు పర్యటించనున్నారు. 1981 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి.

# 100% ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఒట్టిమాటే!

## 2021లోనే అన్ని ఇళ్లకూ తాగునీరు అబద్ధం

## 2024 జూలైలో 4.49 లక్షల ఇళ్లలో సర్వే చేస్తే.. 1.28 లక్షల ఇళ్లకు లేవని తేలింది

## పాఠశాలల్లో ఆహార కల్తీ పై అనుమానాలు: శాసనమండలిలో మంత్రి సీతక్క

హైదరాబాద్, డిసెంబరు 17 : నల్లా కనెక్షన్ల ద్వారా 100 శాతం ఇళ్లకు తాగునీటిని సరఫరా చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచినట్లు 2021లో ప్రకటించారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చెప్పారు. నల్లా కనెక్షన్లతో 53,98,219 ఇళ్లకు మంచి నీటిని సరఫరా చేసినట్లు 2021 జనవరిలో జీవోఐ-ఐఎంఐఎస్ వెబ్‌సైట్ ప్రకారం ప్రకటించారని గుర్తుచేశారు. కానీ, 2024 జులైలో 4.49 లక్షల ఇళ్లలో కుటుంబ సర్వే నిర్వహించగా 3.21 లక్షల ఇళ్లకే నల్లా కనెక్షన్‌లు ఉన్నాయని, మరో 1.28 లక్షల గృహాలకు లేవని తేలిందని చెప్పారు. శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సీతక్క సమాధానం చెబుతూ ఈ వివరాలు వెల్లడించారు. నీటిసరఫరాను మెరుగుపర్చడానికి గాను నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 2 టీఎంసీల నీరు విడుదల చేసేందుకు కర్ణాటకతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆమె చెప్పారు. రాష్ట్రంలోని ఆశ్రమ పాఠశాల్లో వరుసగా జరుగుతున్న ఆహార కల్తీ ఘటనలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సీతక్క అన్నారు. మండలిలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ.. ఆయా స్కూళ్లకు సామగ్రిని సరఫరా చేసే వారిపై నిఘా పెంచినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లలో జరుగుతున్న వరుస ఘటలపై హౌస్ కమిటీ వేసి విచారణ జరిపించాలని మధుసూదనాచారి కోరగా, ఏసీబీకి రిఫర్ చేయాలని ఎంఎస్ ప్రభాకర్ సూచించారు. నిరసన తెలిపే విషయంలోనూ బీఆర్ఎస్ నేతల్లో సమానత్వం లేదని మంత్రి సీతక్క చెప్పారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలకు బేడీలు వేశారు తప్ప.. కేటీఆర్, హరీశ్ బేడీలు వేసుకోలేదని, వారి దొరతనం మరోసారి బయటపడిందని అన్నారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుఉతూ.. రైతులకు బేడీలు వేయడంపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదన్నారు. లగచర్ల రైతుకు బేడీలు వేయడంపై ఆగ్రహించిన సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యులపై చర్యలు కూడా తీసుకున్నారని గుర్తుచేశారు. కాగా.. పదేళ్ల పాటు తాము చేసిన తప్పులకు బేడీలు వేయించుకునే అర్హత ఉందంటూ సింబాలిక్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బేడీలతో అసెంబ్లీకి వచ్చారని మంత్రి జూపల్లి చమత్కరించారు.

**బడి మానేస్తున్న బాలికలు పెరుగుతున్నరు**

రాష్ట్రంలో వివిధ కారణాలతో బడి మానేస్తున్న బాలికల సంఖ్య పెరిగిపోవడం ఆందోళనకరమైన అంశమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. పాఠశాలల మూసివేతపై బీఆర్ఎస్ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధాం ఇస్తూ.. విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యత అన్నారు. పాఠశాలల్లో విద్యార్థినుల సంఖ్య 22 లక్షల నుంచి 18 లక్షలకు తగ్గిపోవడం బాదకరమన్నారు. 2023-24లో 1745 స్కూళ్లలో, 2024-25లో 1913 స్కూళ్లలో విద్యార్థులు చేరలేదని వివరించారు. ఉపాధ్యాయ నియామకాల తర్వాత 79 స్కూళ్లలో తరగతులను పునఃప్రారంభించినట్లు తెలిపారు.

# జేపీసీకి జమిలి బిల్లులు!

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను అర్జున్ రామ్ మేఘ్వాల్ కొట్టిపారేశారు. ఈ ఎన్నికలకు రాజకీయాలతో సంబంధం లేదని తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఉభయ సభల ఎన్నికలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు కేంద్ర జాబితాలోనే ఉన్నాయని గుర్తుచేశారు. రాష్ట్రాల అధికారాలను, రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని ఈ బిల్లులు దెబ్బతీయవని, దేశ హితం కోసమే జమిలి ఎన్నికలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ సూచనల మేరకు.. ఈ బిల్లులను విస్తృత చర్చల నిమిత్తం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి నివేదించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. జేపీసీలో దీనిపై విస్తృత చర్చలు జరుగుతాయని.. జేపీసీ నివేదికను క్యాబినెట్ ఆమోదిస్తుందని, అనంతరం ఈ బిల్లులపై సభలో మరోసారి చర్చ జరుగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. కాగా.. తొలుత ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో దీనిపై ఓటింగ్ జరిగింది. దాంట్లో అనుకూలంగా 269 మంది ఓటు వేయగా, 198 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. కాగా.. జమిలి ఎన్నికలకు పూర్తి మద్దతునిస్తున్నామని టీడీపీ నేత, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటించారు. తమ నేత చంద్రబాబు నాయుడు ఇలాంటి వినూత్న ఆలోచనల విషయంలో ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారని పేర్కొన్నారు. 2024లో ఎన్నికలకు రూ.10వేల కోట్లకు పైగా ఖర్చయిందని, ఒకేసారి ఎన్నికలు జరిగితే 40% ఖర్చు తగ్గిపోతుందని లా కమిషన్, నీతీ ఆయోగ్ నివేదికలు కూడా సమర్పించాయని గుర్తుచేశారు. లోక్‌సభలో నలుగురు సభ్యులను కలిగి ఉన్న వైసీపీ కూడా ఈ బిల్లుకు మద్దతు తెలిపింది. అలా తెలిపిన ఏకైన ఎన్డీయేతర పార్టీ వైసీపీనే కావడం గమనార్హం. లోక్‌సభలో సభ్యులే లేని బీజేడీ వైఖరి ఇంకా తెలియాల్సి ఉంది. ఆ పార్టీకి రాజ్యసభలో ఏడుగురు సభ్యులున్నారు. ఇక.. విప్ జారీ చేసినప్పటికీ అనేక మంది బీజేపీ సభ్యులే మంగళవారం ఓటింగ్ సమయంలో సభకు గైర్హాజరు కావడం గమనార్హం. అలా సభకు రాని 20 మంది బీజేపీ ఎంపీలకు ఆ పార్టీ నోటీసులు పంపింది. మంగళవారం సభలో 467 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో మూడింట రెండువంతుల మంది అంటే.. 311 మంది! కానీ అనుకూలంగా వచ్చిన ఓట్లు 269 మాత్రమే. సాధారణంగా రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి సభలో మూడింట రెండొంతుల మంది సభ్యుల ఆమోదం అవసరం. బిల్లులను ప్రవేశపెట్టడానికి 2/3 మెజారిటీ అవసరం లేదుగానీ.. ఆ మెజారిటీని అధికార పక్షం ఇప్పుడే సమకూర్చుకోలేకపోవడం ఈ బిల్లు భవిష్యత్తును సూచిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**15 పార్టీలు వ్యతిరేకం..32 అనుకూలం**

కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, శివసేన (యూబీటీ), టీఎంసీ, అకాలీదళ్, ఎంఐఎం, ఐయూఎంఎల్, ఆరెస్పీ సహా 15 పార్టీలు ఈ బిల్లులను వ్యతిరేకించగా.. బీజేపీ, తెలుగుదేశం పార్టీ, శివసేన (శిందే వర్గం) సహా 32 పార్టీలు సమర్థించాయి. రాజ్యాంగ మౌలిక స్వభావంపై ఈ బిల్లులు దాడి చేస్తున్నాయని, రాజ్యాంగంలోని కొన్ని అంశాలను పార్లమెంట్ కూడా మార్చలేదని కాంగ్రెస్ సభ్యులు మనీశ్ తివారీ, గౌరవ్ గొగోయ్ విమర్శించారు. రాష్ట్రాల ఎన్నికలను కూడా నిర్ణయించడం రాజ్యాంగానికి వ్యతిరేకమని మనీశ్ తివారీ మండిపడ్డారు. "ఇది రాజ్యాంగ వ్యతిరేక బిల్లు. దేశ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. మేం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. "కేంద్ర ప్రభుత్వం పడిపోయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎందుకు పడిపోవాలి?" అని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ప్రశ్నించారు. వేరొకరి టైమ్‌టేబుల్ కోసం.. ప్రజా తీర్పు మేరకు పాలన సాగిస్తున్నవారి టైమ్‌టేబుల్ ఎందుకు కుదించుకుపోవాలి?" అని నిలదీశారు. ఒకవేళ ప్రస్తుత వ్యవస్థను జమిలి ఎన్నికలతో మార్చేసినా.. భవిష్యత్తులో కేంద్రంలోగానీ, రాష్ట్రంలోగానీ ప్రభుత్వం కూలిపోతే మళ్లీ ఇదే తరహా గందరగోళం ఏర్పడుతుందని థరూర్ అభిప్రాయపడ్డారు. కాబట్టి ఇప్పుడు జరుగుతున్న వ్యవహారమంతా నిరర్థకం, నిష్ఫలమని వ్యాఖ్యానించారు. ఇక.. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారితీస్తాయని సమాజ్‌వాదీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ విమర్శించారు. దేశంలో భిన్నత్వాన్ని, సమాఖ్య స్ఫూర్తిని ఈ బిల్లు దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. లోక్‌సభ పదవీకాలానికి, శాసనసభ పదవీకాలానికి ఎలా ముడిపెడతారని తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ప్రశ్నించారు. ఈ బిల్లులు రాష్ట్రాల శాసనసభలకు ఉన్న స్వతంత్ర ప్రతిపత్తిని హరిస్తాయని అన్నారు. జమిలి ఆచరణ సాధ్యం కాదని, అది దేశంలో నియంతృత్వపాలనకు దారితీస్తుందని.. ప్రజాస్వామ్యం, వైవిధ్యం దెబ్బతింటాయని డీఎంకే నేత టీఆర్ బాలు అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి ఈ బిల్లులు వ్యతిరేకమని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ఇక.. జమిలి ఎన్నికలకు తమ పార్టీ వ్యతిరేకమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' విధానం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని, నియంతృత్వానికి దారితీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, భారత రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ నెహ్రూ-గాంధీ కుటుంబం వ్యక్తిగత జాగీరుగా, సొంత ఆస్తిగా మార్చుకొందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. పార్లమెంటును మోసగించిందని ఆరోపించారు. మంగళవారం రాజ్యసభలో రాజ్యాంగంపై జరిగిన చర్చ ముగింపు సందర్భంగా ఆయన ప్రసంగించారు. భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడానికే నెహ్రూ ప్రథమ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చారని తెలిపారు.

**31 మంది సభ్యులు.. 90 రోజులు**

శుక్రవారంతో శీతాకాల సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో ఆలోగానే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ బిల్లులపై జేపీసీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలా చేయలేకపోతే ఈ బిల్లులు మురిగిపోతాయి. వచ్చే సమావేశాల్లో మళ్లీ వీటిని ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కమిటీలో సభ్యుల కూర్పు.. సభలో ఆయా పార్టీలకు వచ్చిన సీట్లపై ఆధారపడి ఉంటుంది. సభలో అత్యధిక సీట్లున్న అతిపెద్ద పార్టీ బీజేపీ కాబట్టి జేపీసీలో ఆ పార్టీ సభ్యులు ఎక్కువ మంది ఉంటారు. కమిటీకి నాయకత్వం వహించే అవకాశం కూడా ఆ పార్టీకే దక్కుతుంది. జేపీసీలో గరిష్ఠంగా 31 మంది ఎంపీలు ఉంటారు. అందులో 21 మంది లోక్‌సభ నుంచి ఉంటారు. జేపీసీ 90 రోజుల్లోగా నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే ఆ గడువును పొడిగించవచ్చు.

# లగచర్ల గిరిజన రైతన్న చేతికి సంకెళ్లా?

## అన్నం పెట్టే చేతికి బేడీలా..మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్

కల్వకుర్తి కడ్తాల్ డిసెంబర్ 17 కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పిలుపు మేరకు లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారి పైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా కాదు కదా రైతులకే భరోసా లేదని మండిపడ్డారు. లగచర్ల రైతులపై రేవంత్ సర్కార్ క్రూరంగా కర్కషంగా ప్రవర్తిస్తుందని ఫైరయ్యారు. లగచర్లలో జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్రవ్యాప్తంగా రైతులు పరిశీలిస్తున్నారని సమయం వస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి రైతన్న సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఇప్పటికైనా రైతులపై కక్ష కట్టిన రేవంత్ సర్కార్ వెంటనే వారిని విడుదల చేసి వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కోఆర్డినేటర్ వీరయ్య మాజీ ఎంపీటీసీలు లచ్చి రామ్ నాయక్ ప్రియా రమేష్ మంజుల చంద్రమౌళి మాజీ ఎంపీపీ సువాలి పంతు నాయక్ మాజీ సర్పంచులు లక్ష్మీ నరసింహ రెడ్డి



హరి చంద్ కాసన్నా నాయకులు పాండు గోపాల్ రవి రాజు బాబా రమేష్ మల్లేష్ పవన్ అంజి శ్రీకాంత్ శ్రీను మోబిన్ హంజెద్ వెంకటేష్ వినోద్ రవికుమార్ సుమన్ హెచ్ ఆర్ మహేష్ శ్రీకాంత్ కృష్ణ గోపాల్ సుమన్ రాజశేఖర్ రాములు సురేష్ ధర్మ కోటేయా జంగయ్య సురేష్ వెంకటేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు





# కొండకల్ గ్రామంలో అయ్యప్ప మహా పడి పూజ

శంకరపల్లి డిసెంబర్:17:(వార్త మిర్రర్) : శంకర్పల్లి :డిసెంబర్ 17:శంకర్పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో మంగళవారం మన్నె నర్సింలు దంపతుల ఆధ్వర్యం లో అయ్యప్ప ఇరుముడి మరియు మహా పడి పూజ ఘనంగా నిర్వహించారు. పూజలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీర్వాదాలు తీసుకున్నారు.అనంతరం కాలే యాదయ్య మాట్లాడుతూ 41 రోజులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు అని అన్నారు . ఈ కార్యక్రమంలో కాలే యాదయ్య,చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కుపల్లి మహిపాల్ , శంకర్పల్లి మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ అప్ప, పిఏసిఎస్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, సురేందర్ రెడ్డి ,గుత్తి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రంలో చీకటి యుగం నడుస్తోంది

## న్యాయం జరిగే వరకు రైతుల గొంతుకను వినిపిస్తాం
## శంకర్‌పల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి

శంకర్‌పల్లి డిసెంబర్:17:(వార్త మిర్రర్) : రాష్ట్రంలో చీకటి యుగం నడుస్తోందని శంకర్‌పల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు మంగళవారం మండల కేంద్రంలోని డా. బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి మండల, మున్సిపల్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ భూములు కాపాడుతామంటూ లగచర్ల రైతులను అరెస్ట్ చేస్తుంటే సీఎం మాత్రం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కఠోర అన్యాయం నిలబడదని, న్యాయం జరిగే వరకు రైతుల గొంతుకను ప్రతిధ్వనిస్తూనే ఉంటామని రాసుకొచ్చారు. రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శశిధర్ రెడ్డి, మండల పార్టీ యూత్ అధ్యక్షుడు, శేరిగూడ మాజీ ఉపసర్పంచ్



ఇంద్రసేనారెడ్డి, గాజులగూడ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్, అశోక్ గౌడ్, ఫరీద్, వెంకట్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, విష్ణు, వంశీధర్ రెడ్డి పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో ప్రసూతి సేవలను, వైద్యసేవలను మెరుగుపరచాలి

## జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 17 : జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఓ.పి. సేవలు, ఆన్ లైన్ రిజిస్టర్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసూతి సేవలను, వైద్య సేవలను మెరుగు పరచాలని, డాక్టర్లు సమయ పాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. రోజుకు ఎన్ని ఓ.పి.లను చూస్తున్నారు, ఎంతమంది డెలివరీలు అయ్యారని, ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలను పెంచుటకు గర్భిణులను ప్రోత్సహించాలని డాక్టర్లకు సూచించారు. ఆసుపత్రిలో పేషెంట్లకు నాణ్యమైన ఆహారాన్ని, త్రాగునీరు అందించాలని, వెంటనే పేషెంట్లకు అందించుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలో శుభ్రమైన త్రాగునీరు సరఫరా చేసే విధంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పేషెంట్ లను కలిసి వారి ఆరోగ్య వివరాలు మరియు హాస్పిటల్ సిబ్బంది వ్యవహరించే తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి భవనానికి కలర్స్ మరియు మరమ్మత్తులు చేయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్, హాస్పిటల్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఈ నెల 22న మిర్యాలగూడలో ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ టోర్నమెంట్

## బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్



మిర్యాలగూడ , డిసెంబర్ 17:-( వార్త మిర్రర్) : డైమండ్ చెస్ అకాడమీస్ అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి మాశెట్టి దివ్యశ్రీ నేతృత్వంలో నల్గొండ జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ బ్రోచర్ ను మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ మంగళవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చెస్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరించి ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ఉత్సాహవంతులైన చెస్ క్రీడాకారులు జిల్లాస్థాయి టోర్నమెంట్ లో పాల్గొని తమ ప్రతిభను చాటాలన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డైమండ్ మాశెట్టి శ్రీనివాస్, చెస్ క్రీడాకారిణి దివ్యశ్రీ లు మాట్లాడుతూ జిల్లాస్థాయి అండర్ 19 చెస్ పోటీలు ఈనెల 22న మిర్యాలగూడ పట్టణంలోని ఐఎంఏ బిల్డింగ్ లో నిర్వహిస్తున్నామని తెలిపారు. చెస్ టోర్నమెంట్ లో పాల్గొనే వారందరికీ ఉచితంగా మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. పాల్గొనే చెస్ క్రీడాకారులు 200 రూపాయలు ఎంట్రీ ఫీజు స్కాన్ చేసి చెల్లించి, తమ తమ పేర్లు నమోదు చేసుకోనే సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. క్రీడాకారులకు సౌకర్యం కోసం.. వివరాల కొరకు 9246137777 సంప్రదించాలని వారు కోరారు. మూడు ప్రత్యేక బహుమతులు టోర్నమెంట్ లో పాల్గొనబోయే అండర్-7, అండర్-9, అండర్-11, అండర్- 13, అండర్-15, అండర్-17, అండర్-19, బాల, బాలికల చెస్ క్రీడాకారులకు వేరువేరుగా 21 బహుమతులు బాలికలకు 21 బహుమతులు బాలురులకు 21 బహుమతులు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. బహుమతులు ఇవ్వనున్నట్లు వారు పేర్కొన్నారు. చెస్ క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కిరాణా రాజేందర్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోల సైదులు ముదిరాజ్, లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు లింగయ్య పాల్గొన్నారు.



## సేవాలాల్ మహారాజ్ జయంతిని ఒక్కరోజు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలి
## ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వినతి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : లంబాడి హక్కుల పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ, ఈరోజు లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మరియూ భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గార్లను అసెంబ్లీలో కలిసి లెటర్ ప్యాడ్ ఇవ్వడం జరిగింది, భారతదేశంలో 12 కోట్ల లంబాడీలు, తెలంగాణ రాష్ట్రంలో 47 లక్షల లంబాడి ప్రజలు ఉన్నారు, ఇట్టి బంజారా జీవితాలను జాగృతం చేసి, సత్ మార్గంలో నడవడానికి కృషిచేసినటువంటి బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ యొక్క జయంతిని ఆప్షనల్ హాలిడేగా కాకుండా, ఒకరోజు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని, అట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అసెంబ్లీలో మాట్లాడాలని ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మరియూ భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గార్లకు లెటర్ ప్యాడ్ ద్వారా కోరడం జరిగింది, కాంగ్రెస్ ప్రజా పాలనలోని ఇందిరమ్మ రాజ్యంలోనైన గిరిజనుల యొక్క ఆత్మ గౌరవానికి, గిరిజనుల యొక్క హక్కులను కాపాడాలని కోరారు ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఎంపీటీసీ శ్రీహరి నాయక్, ఎల్ హెచ్ పి ఎస్ ఆలేరు నియోజకవర్గం ఉపాధ్యక్షులు నరేష్ నాయక్,మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు లింగ నాయక్, మేడ్చల్ జిల్లా మండల అధ్యక్షులు శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు



## కీ.శే బొమ్మారపు యాదగిరి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి-కంచర్ల రామకృష్ణారెడ్డి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : భువనగిరి మండలం తాజ్ పూర్ మాజీ సర్పంచ్ బొమ్మరపు సురేష్ గారి తండ్రి. బొమ్మరపు యాదగిరి మరణించడంతో వారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన, యాదాద్రి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, మండల అధ్యక్షులు జనగాం పాండు, మండల ప్రధాన కార్యదర్శి నీల ఓం ప్రకాష్ గౌడ్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, మరియు పార్టీ కార్యకర్తలు తాజ్పూర్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## కీ.శే చిలువేరు దేవమ్మ దశదిన కార్యక్రమానికి హాజరైన-మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన కీ.శే చిలివేరు దేవమ్మ ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆమె దశదినకర్మ కార్యక్రమం సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, సంస్థాన్ నారాయణపురం మాజీ సర్పంచ్ సికిలమెట్ల శ్రీహరి హాజరై దేవమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు తెలంగాణ బిక్షం, చిలువేరు దేవమ్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



## లంగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించిన భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి-కంచర్ల రామకృష్ణారెడ్డి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు, లంగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించిన, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, భువనగిరి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, మండల ప్రధాన కార్యదర్శి నీల ఓం ప్రకాష్ గౌడ్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డా, ర్యాకల శ్రీనివాస్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

# అక్రమ కట్టడాలపై కొరడా కట్టడాలు, ఫెన్సింగ్‌లను తొలగించిన రెవెన్యూ అధికారులు

### ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చడం పట్ల అసహనం వ్యక్తం చేసిన మున్సిపల్ చైర్మన్







మిర్యాలగూడ డిసెంబర్ 17:-( వార్త మిర్రర్ ప్రతినిధి) : నలగొండ జిల్లా మిర్యాలగూడలో గత ప్రభుత్వ పాలనలో ఆక్రమణలకు గురైన లక్షలాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను రెవిన్యూ అధికారులు మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలు, ఫెన్సింగులు తొలగించి ప్రభుత్వ స్థలం పేరిట హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే నార్కట్ పల్లి- అద్దంకి హైవేపై ఉన్న 626 సర్వే నెంబర్ లోని ప్రభుత్వ భూమిని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ సోదరి రాయపూడి భవానీ ఆక్రమించినట్టు గుర్తించిన రెవెన్యూ అధికారులు సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఆదేశాలతో ఆ సర్వే నెంబర్ లో వేసిన ఫెన్సింగ్ ను ఇతర కట్టడాలను తొలగించారు. కాగ ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆక్రమణల పేరిట ఫెన్సింగ్ తొలగించడం, కట్టడాలు కూల్చడం పట్ల మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అసహనం వ్యక్తం చేశారు. తనపై రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వాస్తవానికి తనకు ఆ సర్వే నెంబర్లోని భూమికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన సోదరి చట్ట ప్రకారం 711 సర్వే నెంబర్ లో 22 గుంటల భూమి కొనుగోలు చేసిందని, పక్కా డాక్యుమెంట్లు ఉన్నాయన్నారు. ఎలాంటి కొలతలు చేయకుండా కూల్చడం ఏమిటని ఆయన అన్నారు. కాగా 626 సర్వే నెంబర్ లో మూడు గుంటల ఆక్రమణకు గురయ్యాయని ఎటువంటి నోటీసు లేకుండా బౌండరీలు చూపకుండా ఫెన్సింగ్ తొలగించడాన్ని పట్టదారు రాయపూడి భవానీ భర్త ఉమాశేఖర్ ఖండించారు తప్పు పట్టారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఇలా చేయడం దారుణమన్నారు. అదేవిధంగా సర్వే నంబర్ 626లోని సుమారు 2 గుంటల భూమిలో కేటాయింపు లేకుండా అక్రమంగా నిర్మాణం ప్రారంభించిన తాపీ, వడ్డీ, వడ్డెర సంఘం భవనాన్ని కూడ కూల్చివేశారు. డిజిటల్ సర్వే ద్వారా సర్వే నంబర్ 626లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందనీ నిర్ధారించిన అనంతరం ఫెన్సింగ్ తొలగించామని తహసీల్దార్ ఎన్.హరిబాబు వివరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దామరచర్ల, ఆడవిదేవులపల్లి తహసీల్దార్లు జవహర్, సురేష్, ఆర్ఐలు టీ.రామకృష్ణ, సత్యనారాయణ, శ్యాం, సర్వేయర్ ఎండీ. ఖదీర్ లున్నారు.

# భవిష్యత్తు ఎర్రజెండాదే

## ప్రపంచంలో అనేక దేశాల్లో కమ్యూనిస్టులు అధికారంలోకి రావడమే నిదర్శనం

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్






వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 17 : ప్రపంచంలో అనేక దేశాల్లో పాలక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేసి కమ్యూనిస్టులను అధికారులకు తీసుకొచ్చారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ లు అన్నారు. చౌటుప్పల్ మండల కేంద్రంలోని ఎస్ఎమ్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో జరుగుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఎం మూడవ మహాసభల్లో చివరి రోజైన మంగళవారం ముఖ్య అతిథులుగా మహాసభలో పాల్గొని వారు మాట్లాడుతూ పక్కనున్న శ్రీలంకలో, నేపాల్ లో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారని ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో పెద్ద పార్టీగా అవతరించిందని, జర్మనీ స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కమ్యూనిస్టులు గెలిచారని అన్నారు. అమెరికా చుట్టూత ఉన్న వెనిజులా, అర్జెంటీనా లాంటి దేశాల్లో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారన్నారు. ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయిస్తూ తన సంక్షేవాన్ని ఇతర దేశాలపై రుద్దుతూ పూట గడుపుతుందన్నారు. దాన్ని అంటగాగుతున్న భారతదేశం అమెరికా కనుసన్ననల్లో కొనసాగిస్తుందని దేవుడి పేరుతో రాజకీయాలు చేసి అయోధ్యలో రామ మందిరం నిర్మాణం చేసి ప్రారంభించినా మొన్న జరిగిన ఎన్నికల్లో అక్కడి ప్రజలు ఓడించారన్నారు. బిజెపి అనుసరిస్తున్న విభజన రాజకీయాలను తిప్పికొడుతూ వర్గ ఉద్యమాల్ని పెంచాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఒక్క ఫ్రీ బస్సు తప్ప మిగతా ఏ ఒక్క గ్యారెంటీని అమలు చేయలేదన్నారు. రైతు రుణమాఫీ, పెన్షన్ల రెట్టింపు, ప్రతి మహిళకు 2500 రూపాయలు, పెళ్ళికానుక ఇలాంటి వాటిని అమలు చేయలేదన్నారు.

ఈ మహాసభల్లో జిల్లా కార్యదర్శి ఎండి జాంగిర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, పైల్ల ఆశయ్య, సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మంగ నర్సింలు,మాటూరు బాలరాజు, కల్లూరు మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండి పాషా, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హాస్టల్ విద్యార్థులకు రగ్గులు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

### సబ్ కలెక్టర్ అమిత్ కు వినతి






మిర్యాలగూడ , డిసెంబర్ 17:-( వార్త మిర్రర్) ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు హాస్టల్ విద్యార్థులకు చలికి తట్టుకునే రగ్గులు ఇవ్వాలని ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్ సైదానాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలో వచ్చిన తర్వాత సంక్షేమ రంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో చలి విపరీతంగా పెరుగుతున్న కూడా చలికి తట్టుకునే రంగులను పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. గత పది సంవత్సరాల నుంచి హాస్టల్ విద్యార్థులకు పెట్టెలు ప్లేట్లు గ్లాసులు గత ప్రభుత్వం అందించకుండా విద్యార్థులను అన్యాయం చేసిందన్నారు. కావున నూతన కాంగ్రెస్ ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు ప్లేట్లు పెట్టెలు గ్లాసులు తక్షణమే అందించాలన్నారు. అద్దె భవనాల్లో ఉంటున్న గురుకుల సంక్షేమ హాస్టల్లకు సొంత భవనాలను నిర్మించాలని అన్నారు ప్రభుత్వం పెంచిన మెనూకు ప్రభుత్వం అందించాలని అంటున్న మెనూ పొంతన లేకుండా ఉందన్నారు కావున తక్షణమే ప్రభుత్వం నిర్దిష్ట మెనూను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ప్రసన్న, దామరచర్ల మండల కార్యదర్శి వీరన్న, వేములపల్లి మండల కార్యదర్శి సంపత్, ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, సూర్య, శీను, రవి, సమీర్ పాల్గొన్నారు



## అధైర్యపడొద్దు అండగా ఉంటా

### బిజెపి రాష్ట్ర నాయకుడు.. ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి

కల్వకుర్తి ఊర్కొండ డిసెంబర్ 17 వార్త మిర్రర్ ప్రతినిధి:- ఊర్కొండ మండలం బాల్య లోక్య తండ గ్రామ పంచాయతీ లో కేతావత్ లచ్య నాయక్ అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకొని వెంటనే తెలుసుకున్న నాగర్ కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కరాటే అసోసియేషన్ చైర్మన్, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి వారి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు రూ “5000/- రూపాయలు ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఎస్టి మోర్చ అధ్యక్షుడు వెను నాయక్ , గ్రామ యువ నాయక్ విష్ణు నాయక్, కేతవాత్ రవీందర్ నాయక్ ,తిరుపతి నాయక్, తదితరులు మరియు కుటుంబ సభ్యులు ఉన్నారు.



## మాతృభూమి రియల్ ఎస్టేట్ ఆఫీస్‌ను ప్రారంభించిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

శంకర్‌పల్లి డిసెంబర్:17:(వార్త మిర్రర్) : శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని గచ్చిబౌలి డివిజన్ పరిధి నల్లగండ్ల హుడా కాలనీలో నూతనంగా శంకర్‌పల్లి మున్సిపాల్టీకి చెందిన దారం సంగమేష్ గుప్త ఏర్పాటు చేసిన మాతృభూమి రియల్ ఎస్టేట్ ఆఫీస్ ను స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రియల్ ఎస్టేట్ రంగం సక్రమంగా అభివృద్ధి చెందుతూ, నివాసాలు, కార్యాలయాలు, ఇతర వాణిజ్య అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తోందని. నల్లగండ్ల ప్రాంతంలో మాతృభూమి రియల్ ఎస్టేట్ ఆఫీస్ ప్రారంభం కావడం స్థానికులకు మరింత ఉపయోగమవుతుందని తెలిపారు. మాతృభూమి రియల్ ఎస్టేట్ విశ్వసనీయత, నిబద్ధతతో మరింత మంది కస్టమర్లు నమ్మకాన్ని సంపాదించాలని సూచించారు. విశ్వసనీయమైన సేవలందించే మాతృభూమి సంస్థ చైర్మన్ సంగమేశ్వర్ కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షులు జలేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రంజిత్ పూరి, సంయుక్త కార్యదర్శి కృష్ణ మూర్తి, కోశాధికారి దొరబాబు, నాయకులు శేఖర్, నర్సింగ్, రంగస్వామి, రాజు, కాలనీ వాసులు స్థానిక నేతలు పాల్గొన్నారు.



## కార్యకర్తలతో సరదాగా చాయ్ పే చర్చలో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్‌రెడ్డి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : భువనగిరి పట్టణ కేంద్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని నాయకుల, కార్యకర్తలతో చాయ్ తాగుతూ కొంతసేపు సరదాగా గడిపిన, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి, ఈ చాయ్ పే చర్చ కార్యక్రమంలో బిఆర్ఎస్ బోనగిరి మండల అధ్యక్షులు జనగాం పాండు, మండల ప్రధాన కార్యదర్శి నీల ఓం ప్రకాష్ గౌడ్ ,బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, అనాజ్ పురం బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బాత్క అశోక్ యాదవ్, తదితర బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు




## తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జక్కుల చంద్రశేఖర్ నియామకం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 17 : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్ ను నియమించబడ్డారు. ప్రమాణ స్వీకారం హరిహర కళాభవన్ హైదరాబాద్ నందు జరిగింది. తెలంగాణ పద్మశాలి సంఘ అభ్యున్నతికి, సమాజహిత కార్యక్రమాలు చేస్తున్న కృషిని గుర్తించి కార్యదర్శి బాధ్యతలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా చంద్ర శేఖర్ మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన టిఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు వల్లకటి రాజ్ కుమార్, రాష్ట్ర సంఘ గౌరవ సలహాదారులు భోగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్, రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లకు చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. మరియు పద్మశాలి అభ్యున్నతికి ఎల్లవేళలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పద్మశాలి సంఘ రాష్ట్ర కార్యదర్శిగా జక్కుల చంద్ర శేఖర్ నియామకం పట్ల జగిత్యాల జిల్లా ప్రాంత పద్మశాలి బాంధవులు, భూపతిపూర్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఏపీజీవీబీ పేరు తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పు

### తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా

### ఖాతాదారులకు మెరుగైన సేవలు

### బ్యాంకు మేనేజర్ హర్షవర్ధన్ రెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 17 : కేంద్ర ఆర్థిక సేవల విభాగం ఆదేశానుసారం ఉమ్మడి అంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని మారుమూల గ్రామీణ ప్రాంతాలలో ఎన్నో బ్యాంకింగ్ సేవలు అందించిన ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఇక నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంకు గా మారి రాష్ట్ర వ్యాప్తంగా ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు అందిస్తుందని చౌటుప్పల్ మండలంలోని దండు మల్కాపురం ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ కె హర్షవర్ధన రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పుడు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక బ్రాంచీలు ఉన్న బ్యాంక్ గా మారనుందని, కేంద్ర ప్రభుత్వం గ్రామీణ బ్యాంక్ లను అనుసంధానం చేసి ప్రతి రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంక్ ఉండేలా చర్యలు తీసుకుందని మేనేజర్ హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. ఇందులో బాగంగా తెలంగాణ రాష్ట్రంలోని అంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖలు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖలు కలిపి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పు చేసే సమయంలో మన బ్యాంక్ సేవలు ఈ నెల 28 నుంచి 31 వరకు పూర్తిగా ఆగిపోనున్నాయని, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపిఐ అనగా ఫోన్ పే, గూగుల్ పే ఇంకా కొన్ని సేవలు పూర్తిగా పనిచేయవని మేనేజర్ తెలిపారు. కావున మన బ్యాంక్ ఖాతాదారులు ముందుగా గమనించి ఈనెల 27 లోపు అత్యవసరమైన బ్యాంకింగ్ కార్య కలాపాలను నిర్వహించుకోవాలని మేనేజర్ తెలిపారు. బ్యాంకు సేవలు తిరిగి 1వ తేదీ జనవరి 2025 నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా అన్ని రకాల సేవలు యధావిధిగా ఖాతాదారులకు



అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ మార్పు సమయంలో కలిగే అసౌకర్యానికి చింతిస్తూ రేపటి మెరుగైన సేవల కోసం జరిగే ఈ మార్పుకి సహకరించ వలసిందిగా మేనేజర్ హర్షవర్ధన రెడ్డి ఖాతాదారులకు విజ్ఞప్తి చేసారు.

# రజాకార్లను తలదన్నే రీతిలో కాంగ్రెస్ పాలన

### ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం

### అక్రమ కేసులు ఉప సంహరించుకొని, క్షమాపణలు చెప్పాలి

### దేవరకొండ ఎమ్మెల్యే మాజీ రవీంద్ర కుమార్



దేవరకొండ డిసెంబర్ 17 వార్త మిర్రర్ : రైతులపై రేవంత్ సర్కార్ పెట్టిన అక్రమ కేసులు ఉప సంహరించుకొని, క్షమాపణలు చెప్పాలి అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.గురువారం లగచర్ల రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ పిలుపు మేరకు దేవరకొండ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ గారు మాట్లాడుతూ.......రజాకార్లను తలదన్నే రీతిలో కాంగ్రెస్ పాలన అని అన్నారు.కొడంగల్‌లో ఫార్మా కంపెనీ కోసం అర్ధరాత్రి లైట్లు ఆర్పించి, గిరిజన మహిళలపై పోలీసులతో దాడులు చేశారు అని అన్నారు.గచర్ల తాండాలో ప్రజలను చిత్ర హింసలకు గురిచేసిన పోలీసులు అని తెలిపారు.గిరిజన పేదల భూములు లాక్కుని నీ కుటుంబానికి కట్టబెట్టడానికి సిగ్గులేని ప్రభుత్వం అని అన్నారు.ఎన్నికల హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం అయింది అని అన్నారు. 12 నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలిపే పరిస్థితి వచ్చింది అని ఆయన అన్నారు బడికి పోయే పిల్లల నుండి పింఛన్లు అందుకునే అవ్వా తాతల దాకా రోడ్లు ఎక్కారంటే ఆ ఘనత రేవంత్ రెడ్డిదే అని తెలిపారు.కేసీఆర్ గారు బతుకమ్మ పండుగ వేల చీరెలు ఇచ్చిండు. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషన్ కిట్లు ఇచ్చిండు, చెరువుల్లో చేపలు వేసిండు. గొర్రెలు ఇచ్చిండు కేసీఆర్ ప్రభుత్వం పోయాక అన్నీ పోయాయి అని అన్నారు. నేడు 10వేలు, రేపయితే 15వేల రైతు భరోసా అన్నరు. ప్రజలు నమ్మితే నట్టేట ముంచారు.కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతు బంధు ఆపలేదు మంత్రుల, ఎమ్మెల్యేల జీతాలు ఆపి మరీ రైతులకు రైతు బంధు ఇచ్చిండు అని తెలిపారు.ఇప్పుడు కరోనా లేదు ఎందుకు రైతు బంధు పడలేదు

### 15వేలు పడలేదు, కేసీఆర్ ఇచ్చే పది వేలు పడలేదు

రైతులను ఘోరంగా మోసం చేశారు అని అన్నారు.రైతు బంధు కింద 11 విడతల్లో 72వేల కోట్ల రూపాయలు ఇచ్చిండు కేసీఆర్ గారు అని గుర్తు చేశారు మహిళలకు 2500 అన్నడు. ప్రతి మహిళకు 30వేల బాకీ పడ్డడు అని తెలిపారు.బతుకమ్మ చీరెలు అన్నడు, 500 ఇస్తడు అన్నడు ఎగ్గొట్టిండు అని అన్నారు వృద్ధులకు 4వేల పింఛన్ ఇస్తా అని మాట తప్పిండు ఇచ్చే రెండు వేల పింఛన్ కూడా రెండు నెలలు ఎగ్గొట్టిండు అని గుర్తు చేశారు.పింఛన్లు దగా రైతులకు బోనస్ దగా,రుణమాఫీ దగా,తులం బంగారం దగా,విద్యార్థులకు జాబ్స్ దగా,మహిళలకు 2500 దగా, అన్నీ దగా ఎనుముల రేవంత్ రెడ్డి కాదు, ఎగవేతల రెడ్డి చీఫ్ మినిస్టర్ కాదు, చీటింగ్ మ్యాన్ అన్ని పంటలకు బోనస్ అని మోసం చేసిండు అని ఆయన తెలిపారు.ఓట్ల ముందు డిసెంబర్ 9 తారీఖు రుణమాఫీ అన్నడు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆగస్టు 15నాటికి పూర్తి చేస్తా అన్నడు అని గుర్తు చేశారు.దేవుళ్ల మీద ఒట్లు వేసి మాట తప్పిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన అన్నారు.రుణమాఫీ డిసెంబర్ 9, 2024 వరకు చేస్తానని ఇప్పుడు అంటున్నారు, అది కూడా 3లక్షల మందికే అట ఈ రుణమాఫీ పైసలన్నా పడ్డయి అంటే బీఆర్ఎస్ పార్టీ నిలదీయడం వల్లనే అని ఆయన గుర్తు చేశారు.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అనేది పెద్ద మోసం నిరుద్యోగ యువత పై అరాచకం చేస్తున్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులకు రాజ్యంగా ఫలాలు దక్కకూడదా రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగం పట్టుకొని తిరుగుతాడు, రేవంత్ మాత్రం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నడు రాహుల్ గాంధీ ఎక్కడున్నావు, ఆరు గ్యారెంటీల బాధ్యత నాది అని చెప్పిన సోనియా గాంధీ ఎక్కడున్నారు. అధికారం వచ్చాక పత్తా లేకుండా పోయారు.కాంగ్రెస్ వికృత వైఖరి పట్ల గ్రామ గ్రామాన చర్చలు పెట్టాలి. ప్రజలు, రైతులు, యువత అందరికీ అర్థమయ్యేలా వివరించాలి అని పిలుపు నిచ్చారు.మూసీ సుందరీకరణకు లక్షా 50వేల కోట్లు ఖర్చు చేస్తరట సుందరీకరణ వెనుక ఉన్న ముసుగు ఏమిటి ప్రభుత్వ పథకాల అమలుకు, పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే పైసలు లేవంటాడు, మూసీకి లక్షా 50వేల కోట్లు అంటడు అని అన్నారు.

# లంగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసి రైతులను వెంటనే విడుదల చేయాలి

### మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో

### నిరసన ర్యాలీ.. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం



మిర్యాలగూడ డిసెంబర్ 17:-( వార్త మిర్రర్ ప్రతినిధి) : కొడంగల్, లగచర్ల రైతులపై కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లమోతు భాస్కర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టి చిత్ర హింసలకు గురి చేశారని రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలిపాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డి కాలనీలో గల టిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి మాజీ



ఎమ్మెల్యే భాస్కర్ రావు ఆధ్వర్యంలో ప్లే కార్డులు చేతబూని నిరసన ర్యాలీ నిర్వహించి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే విజయసింహారెడ్డి తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల సద్బుద్ధి ప్రసాదించాలనికోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ నల్లగొండ జిల్లా వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, నల్గొండ జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా మాజీ కో-ఆప్షన్ సభ్యులు మోహ్సిన్ అలీ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ లు ధనావత్ చిట్టిబాబు నాయక్, బైరం సంపత్, నాయకులు జొన్నలగడ్డ రంగారెడ్డి, పార్టీ అధ్యక్షులు పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, మట్టపల్లి సైదయ్య యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ కుందూరు వీర కోటిరెడ్డి, తాజా మాజీ జెడ్పీటీసీ ఆంగోతు లలిత హాతిరాం నాయక్, మాజీ ఎంపిపి ధనావత్ బాలాజీ నాయక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి.ఇలియాస్ ఖాన్, పూనాటి లక్ష్మీనారాయణ, ఎండి షోయబ్, బిఆర్ఎస్ యూత్ పట్టాన కార్యదర్శి గయాస్, ఫయాజ్, ఇమ్రాన్ గుడిసె దుర్గాప్రసాద్, ఇస్మాయిల్ చోటు పాల్గొన్నారు.

# లంగచర్ల రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేసి రైతులను వెంటనే విడుదల చేయాలి

### మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

### ఆధ్వర్యంలో నిరసన...అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం



వార్తా మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి డిసెంబర్ 17 : కొడంగల్, లగచర్ల రైతులపై కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టి చిత్ర హింసలకు గురి చేశారని రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలిపాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మంగళవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని వలిగొండ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కూసుకుంట్ల



ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల సద్బుద్ధి ప్రసాదించాలనికోరారు. కార్యక్రమంలో చౌటుప్పల మండలం మున్సిపాలిటీ నాయకులు సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్, మాజీ జెడ్పిటిసి పెద్దింటి బుచ్చిరెడ్డి,బిఆర్టియు జిల్లా అధ్యక్షులు ఢిల్లీ మాధవరెడ్డి,మండల పార్టీ ఉపాధ్యక్షులు చిన్నం బాలరాజు కురుమ, యాట యోగానందం, మెట్టు మహేశ్వర్ రెడ్డి, మండల కార్యదర్శి అల్మాస్పేట కృష్ణ,తాడూరి పరమేష్,ప్రధాన కార్యదర్శి గుండెబోయిన వెంకటేష్ యాదవ్, మున్సిపాలిటీ యూత్ అధ్యక్షులు తొర్పునూరి నరసింహ గౌడ్,సీనియర్ నాయకులు కొత్త పర్వతాలు యాదవ్, ముప్పిడి శ్రీనివాస్ గౌడ్,ఉడుగు మల్లేష్ గౌడ్, తూర్పుంటి యాదయ్య,మాజీ సర్పంచులు సుర్వి మల్లేష్ గౌడ్,కానుగు బాలరాజు,వెలువర్తి యాదగిరి, బత్తుల సింహాచలం, మైనార్టీ నాయకులు అతార్ పాషాచాంద్ పాషా, యువ నాయకులుగంజి లింగేష్ నేత,చెవగోని మహేష్ గౌడ్,జానీ, తదితరులు పాల్గొన్నారు..



## మిర్యాలగూడ మండల గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా ప్రకటన

మిర్యాలగూడ డిసెంబర్ 17:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం 46 గ్రామపంచాయతీల ఓటరు తుది జాబితాను ఎంపిడిఓ ఎం.శేషగిరిశర్మ మంగళవారం ప్రకటించారు. ప్రజల కోసం ఆయా కార్యాలయాల్లో పెట్టినట్టు తెలిపారు. మండలంలో పంచాయతీ మొత్తం వార్డుల సంఖ్య 394, పురుషుల ఓటర్లు 27338, మహిళా ఓటర్లు 28233, ఇతరులు 7, మొత్తం 555787 ఓటర్లని తెలిపారు. గ్రామపంచాయతీ పోలింగ్ స్టేషన్ల తుది జాబితా కూడ ప్రకటించారు.



## పెన్షనర్స్ డే సందర్భంగా సీనియర్ పెన్షనర్లకు సన్మానం

మిర్యాలగూడ డిసెంబర్ 17:- (వార్త మిర్రర్) ఉద్యోగాల్లో ఉన్న వారు పెన్షనర్లు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ పోరాడాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టీఎపిఆర్ఎ) జిల్లా అధ్యక్షుడు ఎన్. జగదీష్ చంద్ర అన్నారు. టీఎపిఆర్ఎ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని టీజియుటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పెన్షనర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోరాటాలు చేయకుంటే పెన్షన్ స్కీమ్ కు ఎసరు పెట్టే పాలకులున్నారని ఆయన అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పెన్షనర్స్ వి. బంగారయ్య, లక్ష్మినారాయన, ఎ. కృష్ణారావు, బి.వెంకయ్య, నారాయణ, పాపిరెడ్డి, వీరయ్య, ఆంజనేయులు, నాగయ్య, సూర్యనారాయణ, నరహరి, భృగు మహా ఋషిలను ఘనంగా సన్మానించారు. యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి పి. శ్యాంసుందర్, రాష్ట్ర కార్యదర్శి సత్తిరెడ్డి, జిల్లా కోశాధికారి ఎంఎ.ఖాదర్, నాయకులు పి. సత్యనారాయణరావు, పరిపూర్ణాచారి, పి.రమణారెడ్డి, వాడపల్లి రమేష్, విద్యాసాగర్, పులి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



## కిష్టంపేట-కుర్మపల్లి-కన్నాపూర్

## లింక్ రోడ్డుకు మొక్షమెన్నడు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి డిసెంబర్ 17 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని కిష్టంపేట- కుర్మపల్లి- కన్నపూర్ గ్రామాలను కలుపుతూ వెళ్ళే లింక్ రోడ్డు కేవలం 500మీటర్లు రోడ్డు సరిగా లేక ఈ మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుచున్నారు. ఈ రోడ్డుకు పై బాగాన ఉన్న ఒర్రె ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొంగి పోర్లగా రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. దీంతో రైతులు, పాదచారులు, వాహనదారులకు, పాఠశాల వాహనాలు, తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో పాటు గుంతలు చాలా పెద్దగా ఉండడం వలన వాహనదారులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ మోటార్ సైకిల్‌పై వెళ్ళాలంటే చాలా ఇబ్బందిగా ఉందని, గుంతలో పడితే తీవ్ర గాయలయ్యే అవకాశాలు ఉందంటున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ఇప్పటికి ఈ దారిని పట్టించుకో కపోవడం దురదృష్టకరం, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు ఇట్టి ధ్వంసం అయినా మార్గాన్ని నూతన రోడ్ వేయాలి మరియు నూతన హై లెవల్ వంతెనను నిర్మించాలని 3 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా స్థానిక నాయకులు స్పందించి ఎమ్మెల్యే ఎంపీ లపై, అధికారుల పై ఒత్తిడి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.



## పెన్షనర్స్ డే సందర్భంగా సీనియర్ పెన్షనర్లకు సన్మానం

మిర్యాలగూడ డిసెంబర్ 17:- (వార్త మిర్రర్) ఉద్యోగాల్లో ఉన్న వారు పెన్షనర్లు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ పోరాడాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టీఎపిఆర్ఎ) జిల్లా అధ్యక్షుడు ఎన్. జగదీష్ చంద్ర అన్నారు. టీఎపిఆర్ఎ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని టీజియుటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన పెన్షనర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోరాటాలు చేయకుంటే పెన్షన్ స్కీమ్ కు ఎసరు పెట్టే పాలకులున్నారని ఆయన అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పెన్షనర్స్ వి. బంగారయ్య, లక్ష్మినారాయన, ఎ. కృష్ణారావు, బి.వెంకయ్య, నారాయణ, పాపిరెడ్డి, వీరయ్య, ఆంజనేయులు, నాగయ్య, సూర్యనారాయణ, నరహరి, భృగు మహా ఋషిలను ఘనంగా సన్మానించారు. సమావేశంలో యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి పి. శ్యాంసుందర్, రాష్ట్ర కార్యదర్శి సత్తిరెడ్డి, జిల్లా కోశాధికారి ఎంఎ.ఖాదర్, నాయకులు పి. సత్యనారాయణరావు, పరిపూర్ణాచారి, పి.రమణారెడ్డి, వాడపల్లి రమేష్, విద్యాసాగర్, పులి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.